సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 8 । జూన్ । 2023



సోమశిలలో నీటి నిల్వ
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారానికి 38.173 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 132 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,870
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,556
3 శాతం జీఎస్టీతో	రూ.5,723
నవర (8 గ్రా)	రూ.45,784

గరిష్టం/కనిష్టం
40.5 /31.0

వాతావరణం
మంగళవారంతో పోలిస్తే బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గాయి. గాలిలో 40 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

కమాండ్ కంట్రోల్‌ను పరిశీలించిన ఎస్పీ



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు పోలీసు కార్యాలయంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌ను ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి బుధవారం పరిశీలించారు. సీసీ కెమెరాలు, ఎల్‌హెచ్ఎంఎస్, వీడియో వాల్, డయల్ 100, దిశ కంట్రోల్ రూమ్ వ్యవస్థ తదితరాలను చూశారు. సీసీ టీవీ కెమెరాలు ఎన్ని పనిచేస్తున్నాయి?, ఎక్కడెక్కడ పనిచేయడం లేదు? తదితర వివరాలను ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల సీసీ టీవీ ఫుటేజ్‌ల ద్వారా ఛేదించిన కేసుల గురించి ఆరా తీశారు. దిశ, డయల్ 100 కాల్స్ వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, ఎటువంటి జాప్యం జరగరాదన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి
• జేసీ కూర్మనాథ్



వివరాలు తెలుసుకుంటున్న జేసీ కూర్మనాథ్

ఆత్మకూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా పూర్తి చేయాలని జేసీ కూర్మనాథ్ ఆదేశించారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం వద్ద నిర్మిస్తున్న ఇళ్లను ఆయన బుధవారం హౌసింగ్ పీడీ పి.నరసింహ, డీఈ నటరాజ్‌తో కలిసి పరిశీలించారు. బేస్‌మెంట్ స్థితిలో ఉన్న పలు ఇళ్లను చూసి వెంటనే లబ్ధిదారులతో మాట్లాడి పనులను వేగవంతమయ్యేలా చూడాలని జేసీ ఆదేశించారు. మెప్మా సిబ్బంది లబ్ధిదారులైన మహిళలకు బ్యాంకుల నుంచి రూ.35 వేల రుణం వచ్చేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బల్లి నాగేశ్వరరావు, ఆర్ఐ ఖాసీం, మెప్మా సీఎంఎం మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

హిమతేజకు అంతర్జాతీయ పతకం



హిమతేజ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆసియా జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ – 2023లో రిలే పరుగు పందెంలో హిమతేజ మూడో స్థానం సాధించాడని నెల్లూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌత్ కొరియాలో జరుగుతున్న ఏషియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో 4x100 మీటర్ల రిలే పరుగు పోటీల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లా చిల్లకూరుకు చెందిన వలిపి హిమతేజ మూడో స్థానం సాధించాడని వివరించారు. యువ అథ్లెట్ అంతర్జాతీయ స్థాయిలో పథకం సాధించడంపై ఒలంపిక్ అసోసియేషన్, వివిధ క్రీడా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

రూ.119 కోట్లతో పొగాకు కొనుగోళ్లు



మాట్లాడుతున్న రాజశేఖర్

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో అధికారిక పొగాకు కొనుగోళ్లు గురువారంతో ముగుస్తాయి. ఈ సీజన్‌లో 18 కంపెనీల బయ్యర్లు పాల్గొని పొగాకు కొనుగోలు చేశారని, రూ.119 కోట్ల వ్యాపారం జరిగిందని వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ బుధవారం తెలిపారు. మొత్తం 49,749 బేళ్లను రైతులు తీసుకురాగా, 46,770 బేళ్లు వేలంలో కొనుగోలు చేశారన్నారు. అత్యధికంగా కిలో పొగాకుకు రూ.212, అత్యల్పంగా రూ.170 నమోదైందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సగటు రూ.197.31 నమోదు కావడం వేలం కేంద్రం చరిత్రలో రికార్డుగా నిలిచిందన్నారు. కాగా అదనపు కొనుగోళ్లు మరో వారం రోజుల్లో ప్రారంభిస్తామని, రైతులు తమ వద్ద ఉన్న నిల్వ వివరాలను క్లస్టర్ సూపర్‌వైజర్లకు తెలియజేయాలన్నారు. అధికంగా ఉత్పత్తులను ఐటీసీ కంపెనీ కొనుగోలు చేసిందన్నారు.

సేవా భాగ్యం



నేను.. నా కుటుంబం. అనే ధోరణిలో దాదాపు ప్రతి ఒక్కరూ జీవనం సాగిస్తుంటారు. పక్కవారి గురించి కనీసం ఆలోచించే సమయం కూడా కేటాయించరు. అయితే కొందరు యువతీ, యువకులు తమ సంపాదన నుంచి కొంతమేర సేవలు చేయడానికి ముందుకు వస్తున్నారు. పేదలు, నిరాశ్రయులు, అనాథలకు తమవంతు ఆహారం అందజేస్తూ ఆకలి తీరుస్తున్నారు. నోరు లేని జీవాలకు ఆహారం, నీళ్లు అందిస్తున్నారు.



'హ్యాండ్స్ ఆన్' సంస్థ ద్వారా పేదలకు భోజనాలు

- నిరాశ్రయులు, అనాథలకు అండగా..
- ఆకలి తీరుస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- సంపాదనలో సేవలకు కొంత వెచ్చిస్తున్న యువత
- దుస్తుల పంపిణీ, రక్తదానాలు కూడా..
- ఫంక్షన్లలో మిగిలిన ఆహారం అన్నార్తులకు..

నెల్లూరు సిటీ: పేదరికంలో మగ్గుతున్న వారికి, ఏ ఆదరణ లేని నిరాశ్రయులకు సాయం చేయాలనే ఉద్దేశం కలిగిన కొంతమంది స్నేహితులు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నెలలో కొన్ని రోజులు నేరుగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తమ సంపాదనలో పది శాతం సేవలకు వినియోగిస్తున్నారు. ఆహార పొట్లాలు పంపిణీ చేయడం లేదా అన్నదానం చేయడం వంటివి చేస్తున్నారు. మరికొందరు ఫంక్షన్‌లలో మిగిలిపోయిన భోజనాలను తమ సొంత ఖర్చులతో ఆటోల ద్వారా నిరాశ్రయులకు అందజేస్తున్నారు.

ఏడుగురితో ప్రారంభం

'అద్భుత ఫౌండేషన్'ను సాల్మన్ అనే వ్యక్తి 2015లో ఏడుగురితో ప్రారంభించారు. ఇప్పుడు 40 మంది ఆ సంస్థలో ఉన్నారు. పెళ్లి, ఇతర ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి పేదలు, నిరాశ్రయులు, అనాథలకు అందిస్తున్నారు. అనాథలు ఎవరైనా చనిపోతే వారికి అంతిమ సంస్కారాలు చేస్తున్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏప్రిల్‌లో ఓ ఐదేళ్ల చిన్నారి గుండె సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతుండడంతో ఫౌండేషన్ ద్వారా రూ.90 వేలతో హార్ట్ సర్జరీ చేయించారు. ఫంక్షన్‌లలో భోజనాలు మిగిలిపోతే 78424 42422 నంబర్‌ను సంప్రదించాలని ఫౌండేషన్ అధ్యక్షులు సాల్మన్ తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన వారిలో ఎవరైనా చనిపోతే వారి శరీరాన్ని పొందుపరిచేందుకు ఫ్రీజర్‌లను ఉచితంగా అందజేస్తామని వెల్లడించారు.



'అద్భుత ఫౌండేషన్' ద్వారా ఆహారం అందజేత

వాట్సాప్ గ్రూప్ ద్వారా..

వారంతా స్నేహితులు. తమ వంతు ప్రతి నెలా ఏదో ఒక సేవా కార్యక్రమం చేయాలని సంకల్పించారు. సర్వింగ్ సర్కిల్ అనే సంస్థను కాలేషా, మణికంఠ వారి స్నేహితులు ఏర్పాటు చేశారు. 60 మంది స్నేహితులతో వాట్సాప్ గ్రూప్ పెట్టారు. నిరాశ్రయులకు ఆహార పొట్లాలు అందజేత, వీధి కుక్కలకు ఆహారం, నీళ్లు అందజేయడం, రక్తదాన కార్యక్రమాలు చేస్తున్నారు.

రోజూ అన్నదానం

2020వ సంవత్సరంలో 'హ్యాండ్స్ ఆన్' అనే స్వచ్ఛంద సంస్థను డి.రమేష్ ఏర్పాటు చేశారు. రోజూ సాయంత్రం వలంటీర్ల ద్వారా రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ఇతర కూడలి ప్రాంతాల్లో ఉండే నిరాశ్రయులకు భోజనాలు అందజేస్తున్నారు. నెలకు ఒకసారి మాత్రం ఓ ప్రాంతాన్ని ఎంచుకుని గర్భిణులు, పిల్లలు, హెచ్ఐవీ బాధితులకు న్యూట్రీషన్స్ అందిస్తున్నారు. నెలకు ఒకసారి పాత దుస్తులు కలెక్ట్ చేసి పేదలకు అందజేస్తున్నారు. పాత దుస్తులు ఇవ్వాలన్నా, మిగిలిపోయిన ఆహారం అందించాలన్నా నెంబర్ 92906 23231 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ...

స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలు చేస్తూ.. ఎదుటి వారిని కూడా సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నట్లు పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కోగిలి రమేష్‌రాజు పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేస్తుంటారు. ఇళ్లు కాలిపోయిన బాధితులకు ఆర్థిక సహాయం, పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, పాత బట్టలను సేకరించి పేదలకు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.



ఆహారం పంపిణీకి సిద్ధమైన సర్వింగ్ సర్కిల్ సభ్యులు



పవర్ యూత్ సంస్థ సభ్యుల రక్తదాన శిబిరం

12 ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభం నేడు

నెల్లూరు సిటీ: నెల్లూరు – తిరుపతి మధ్య 12 ఏసీ ఎలక్ట్రికల్ కొత్త బస్సులను గురువారం ఆర్టీసీ చైర్మన్ ఎబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ప్రారంభిస్తారని ఆర్టీసీ డిపో–2 మేనేజర్ శివకేశ్ యాదవ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు నాన్‌స్టాప్‌గా తిరుగుతాయన్నారు. టికెట్ ధర రూ.350 అని తెలియజేశారు.

విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వేదాయపాళెం): జగనన్న విదేశీ విద్యా దీవెనకు సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరానికి మైనార్టీ కులాలకు చెందిన వారు ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారిణి డాక్టర్ ఎ.నిర్మలాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ దేశాల్లో అత్యధిక ప్రాధాన్యత కలిగిన 200 విశ్వవిద్యాలయాల్లో చదువుకునేందుకు మైనార్టీ కులాలకు చెందిన వారు అర్హులన్నారు. ఇతర వివరాల కోసం 99667 40353 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

30 వరకు పసుపు కొనుగోళ్లు

ఉదయగిరి: ఉదయగిరిలో ఇటీవల ఏర్పాటు చేసిన పసుపు కొనుగోలు కేంద్రంలో ఈనెల 30వ తేదీ వరకు రైతుల వద్ద నుంచి కొనుగోళ్లు జరుపుతామని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ పవన్ కుమార్ తెలిపారు. ఆయన ఉదయగిరిలో బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వం మొదట 12వ తేదీ వరకే అనుమతి ఇచ్చినప్పటికీ ఇక్కడి పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేసి 30వ తేదీ వరకు కొనుగోలు కేంద్రం ఉండేలా అనుమతి పొందామన్నారు. రైతులు తమ ఉత్పత్తులను ఎప్పుడు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలో ముందుగానే తెలియజేస్తామన్నారు. రోజూ 300 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్వింటా రూ.6,850 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

- ఉద్యోగాల క్రమబద్ధీకరణ
- జిల్లాలో 460 కుటుంబాలకు మేలు
- సుదీర్ఘ నిరీక్షణకు తెర
- సీఎం నిర్ణయంతో సంతోషం

నెల్లూరు(పొగతోట): కాంట్రాక్ట్ ఉద్యోగులు.. క్రమబద్ధీకరణ కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నారు. ఎంతోమంది పాలకులు చేస్తామన్నారు. కానీ పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేనున్నానంటూ భరోసా కల్పించారు. ఇచ్చిన మాట ప్రకారం వారికి గుడ్‌న్యూస్ చెప్పారు. సీఎం నేతృత్వంలో మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం వందలాది కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపింది. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో 460 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులర్ కానున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాక ముందు 2014 ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దానిని నెరవేర్చారు.



జగనన్న మాటపై నిలబడ్డారు



ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు అర్హత గల కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం శుభపరిణామం. చాలా ప్రభుత్వాలు మారాయి. కాంట్రాక్ట్ ఉద్యోగుల కలను జగనన్న నెరవేర్చి మాటపై నిలబడ్డారు. కాంట్రాక్ట్ ఉద్యోగులం అందరం జగనన్నకు రుణపడి ఉంటాం.

– అల్లం సురేష్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. నేడు వారికి ప్రతిఫలం దక్కింది.

– మన్నేపల్లి పెంచలరావు, ఏపీ ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు, నెల్లూరు జిల్లా

సర్పంచ్ పదవికి రాజీనామా చేశా



నేను 2006లో పడకండ్ల పంచాయతీ సర్పంచ్‌గా గెలిచా. తర్వాత ఏడు నెలలకే వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా అవకాశం రావడంతో 2007 మార్చి 8న పదవికి రాజీనామా చేసి కలువాయి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికపై ఉద్యోగంలో చేరా. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ మంత్రివర్గం ఆమోదం తెలపడం ఆనందంగా ఉంది. నేను, నా కుటుంబం మొత్తం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఆరెల్ల పెంచలరావు, హెల్త్ అసిస్టెంట్, డీసీపల్లి, మర్రిపాడు మండలం

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

– ఎ.పెంచలరెడ్డి, ఏపీఆర్ఎస్ఏ నాయకుడు

వ్యవసాయం చేస్తూ ఉద్యోగంలోకి..



నేను డిగ్రీ వరకు చదువుకున్నా. ఉద్యోగం రాకపోవడంతో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడిని. 2007లో వైద్యారోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్‌గా చేరా. ప్రస్తుతం వెన్నవాడ సచివాలయంలో పనిచేస్తున్నా. ప్రభుత్వ నిర్ణయం ఆనందదాయకం.

– ఎం.కృష్ణారెడ్డి, వెన్నవాడ, ఆత్మకూరు

అభినందించాల్సిన విషయం



సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం అభినందించాల్సిన విషయం.

– కృష్ణప్రసాద్, ఏపీ రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- మనుబోలు మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన
- పిడూరులో ప్రయోగాత్మకంగా సేవా వినతుల క్యాంపెయిన్
- ధ్రువీకరణ పత్రాల పంపిణీ

మనుబోలు: సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే వచ్చాయని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవల సమాచారాన్ని వలంటీర్ల ద్వారా సేకరించి అధికారులు నేరుగా వచ్చి ఒకేచోట ప్రభుత్వ ధృవీకరణ పత్రాలను అందించడమే సేవా వినతుల క్యాంపెయిన్ ఉద్దేశమన్నారు. మండలంలో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మొదట పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన పిడూరు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సేవా వినతుల క్యాంపెయిన్‌ను పరిశీలించారు. గ్రామస్తులకు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్టిఫికెట్లను ఆలస్యం లేకుండా అందించేందుకు ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పిడూరు గ్రామంలో 700 పైచిలుకు సేవలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 400 నమోదై ఉన్నాయని తెలిపారు. గ్రామంలో అందుబాటులో లేని వారికి వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికి ధ్రువీకరణ పత్రాలను పంపుతామన్నారు.



పిడూరులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

• స్థానిక పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బయో ఎనలైజర్‌ను ఎందుకు ఉపయోగించడం లేదని ల్యాబ్ టెక్నీషియన్‌ను ప్రశ్నించారు. వెంటనే వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్‌ను ఆదేశించారు. పీహెచ్‌సీలో కేవలం ఒక్క కాన్పు మాత్రమే జరగడంపై విస్మయం వ్యక్తం చేశారు. కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. ఆస్పత్రికి రాలేని రోగులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యం చేయాలని డాక్టర్ పూజితకు సూచించారు.

• మండలంలోని వెంకన్నపాళెం సచివాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. అనంతరం ఆర్బీకేను చూసి విత్తనాలు, యూరియా, పురుగు మందులను సకాలంలో రైతులకు అందించాలన్నారు.

• మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యా కానుక మండల స్టోరేజీ పాయింట్‌ను హరినారాయణన్ పరిశీలించారు. మడనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను, విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పుస్తకాలను చూశారు. పది పరీక్ష ఫలితాల్లో మండల టాపర్లుగా నిలిచిన పాఠశాల విద్యార్థులు తాటికొండ మనోజ, తాళ్ల జ్యోత్స్న నాగవైష్ణవీని అభినందించారు.

• మడమనూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. బరువు తక్కువున్న పిల్లలను గుర్తించి ఫ్యామిలీ డాక్టర్‌కు చూపించాలని ఐసీడీఎస్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహ, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖలో డిప్యుటేషన్ల రద్దు

నెల్లూరు(అర్బన్): డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఉత్తర్వుల మేరకు జిల్లాలో డిప్యుటేషన్లను రద్దు చేస్తున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (పెద్దాస్పత్రి), 104 కాల్ సెంటర్, పీహెచ్‌సీ సెంటర్లలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని గతంలో పనిచేస్తున్న స్థానాల్లోకి వెళ్లాలన్నారు. ఇటీవల కలెక్టర్ హరినారాయణన్ సైతం ఎలాంటి డిప్యూటేషన్లు అంగీకరించేది లేదని, ఏ శాఖలో ఉన్నా రద్దు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సెలవుపై వెళ్లిన డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆధ్వర్యంలో జిల్లా వైద్య శాఖలో పెద్ద ఎత్తున డిప్యూటేషన్లు జరిగాయి. సుమారు 50 మంది ఉన్నారు. ఏడాది క్రితం జరిగిన ఈ నియామకాల్లో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వీరందరి డిప్యుటేషన్లు ప్రస్తుతం రద్దయ్యాయి.

బాబు, పవన్ ఎప్పటికీ సీఎం కాలేరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు) : చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసి తపస్సు చేసినా వారు ముఖ్యమంత్రి కాలేరని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముదివర్తి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రజలు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబుతో పాటు పవన్‌కల్యాణ్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేవలం ఉనికి కోసమే వారు సంక్షేమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబుకు రాష్ట్ర ప్రజల సంక్షేమం ఏనాడు గుర్తుకు రాలేదన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు అన్యాయం జరుగుతుంటే పట్టించుకోని పవన్‌కల్యాణ్ ఇప్పుడు మంచి చేస్తున్న ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తులకు ప్రజల సంక్షేమం ఎప్పటికీ పట్టదని దుయ్యబట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఓ వైపు అభివృద్ధితో పాటు మరోవైపు సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, మాజీ ఏఎంసీ చైర్మన్లు అచ్యుత్‌రెడ్డి, విజయభానురెడ్డి, జెడ్పీ సభ్యులు లక్ష్మయ్య, శ్రీహరి రెడ్డి, సొసైటీ చైర్మన్లు ప్రసాద్‌రెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ నిర్మలమ్మ, ఎంపీటీసీ సభ్యులు స్వరూపరాణి, సురేంద్రరెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అందరి మన్ననలు వైఎస్ జగన్‌కే

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలందరి మన్ననలు ఉన్నాయని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తి మండలం చెన్నూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం చేపట్టారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు లాంటి మోసగాడు దేశంలోనే లేడన్నారు. జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన అమ్మ ఒడి పథకంపై ఇష్టానుసారంగా మాట్లాడిన బాబు ఇప్పుడు అమ్మకు వందనం అని హామీ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. బాబు వస్తే జాబ్ వస్తుందని గతంలో ఒకసారి మోసం చేశారని, మరోసారి మోసం చేసేందుకు సిద్ధపడుతుండడం సిగ్గుచేటన్నారు. బాబు ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు మోసపోరని తెలియజేశారు. మేనిఫెస్టో అంటే చంద్రబాబుకు చిత్తు కాగితంతో సమానమని దుయ్యబట్టారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలోని ప్రతిహామీని అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. నాలుగు తరాలు గుర్తుపెట్టుకునే విధంగా జగన్ పాలన సాగిందని, 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు ఎన్నిరకాలుగా మోసం చేశారో అందరికీ తెలుసు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనిల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

డానీ సేవలు మరువలేనివి

- పోలీసు జాగిలానికి నివాళి

నెల్లూరు(క్రైమ్) : పోలీసు జాగిలం డానీ సేవలు మరువలేనివని జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం డానీ వడదెబ్బకు గురైంది. వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ ఈనెల 6వ తేదీ రాత్రి మృతిచెందింది. దీంతో డానీకి ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి బుధవారం నివాళులర్పించారు. డానీకి పెన్నానది ఒడ్డున పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బెల్జియం మాలినోస్ జాతికి చెందిన డానీ పేలుడు పదార్థాలను గుర్తించడంలో నిష్ణాతురాలన్నారు. 2017 ఏప్రిల్ 23న జన్మించి హైదరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రెనింగ్ అకాడమీలో శిక్షణ పొందిందని తెలిపారు. 2018 మే 18 నుంచి జిల్లాలోని బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లో విధులు నిర్వహిస్తోందని, డానీ అకాల మరణం బాధాకరమన్నారు. సీఎం, ఇతర ప్రముఖులు జిల్లాకు వచ్చిన సందర్భంలో, తిరుపతి బ్రహ్మోత్సవాలు, షార్ పర్యటన తదితర కార్యక్రమాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీ, ఆర్ఐ శ్రీనివాసులురెడ్డి, ఆర్ఎస్ఐలు, హ్యాండ్లర్ టి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



డానీకి నివాళులర్పిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.40
నన్నవి : రూ.20
పండ్లు : రూ.10



పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆత్మకూరు : పట్టణంలోని జేఆర్‌పేట గాజులవారివీధిలో కాలువ ఒడ్డున పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని ఎస్సై ఎం.శివశంకర్‌రావు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లతో పాటు రూ.4,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుకున్న వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్సై తెలిపారు. ఎస్సై వెంట సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం

వరికుంటపాడు : మండలంలోని గొల్లపల్లి ఎస్టీ కాలనీ ప్రధాన రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. గొల్లపల్లి కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తల, చేతులను ధ్వంసం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా, దుత్తలూరు ఎస్సై ఎస్.ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ధ్వంసానికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

దిశ యాప్‌తో సంపూర్ణ రక్షణ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

- కందుకూరు సిబ్బందిని అభినందించిన ఎస్పీ

నెల్లూరు(క్రైమ్) : మీ మొబైల్‌లో దిశ యాప్ ఉంటే సంపూర్ణ రక్షణ పొందవచ్చని, ప్రతి మహిళ విధిగా వారి ఫోన్‌లో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో కందుకూరు ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్పీ బుధవారం వెల్లడించారు. కందుకూరు మండలానికి చెందిన ఓ మహిళ ఈనెల 6వ తేదీ రాత్రి భోగానం ఊరికి వెళ్లేందుకు కందుకూరు బస్టాండ్‌కు వచ్చారు. అప్పటికే బస్సు వెళ్లిపోవడంతో నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కందుకూరుకు చెందిన కరణ్, జోషి, ఆటోడ్రైవర్ ఫైరోజ్ బాషా పెట్రోల్‌బంక్ సమీపంలో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో కేకలు వేసింది. దీనిని గమనించిన దామోదర్ అనే వ్యక్తి దిశ యాప్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ, ఎస్సై, సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని బాధిత మహిళకు రక్షణ కల్పించారు. సకాలంలో స్పందించిన సిబ్బందితో పాటు దిశయాప్‌కు ఫిర్యాదు చేసిన దామోదర్‌ను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ డి.హిమవతి, కందుకూరు డీఎస్పీ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- కొట్టి చంపారని బంధువుల ఆరోపణ



శ్యామల మృతదేహం

మనుబోలు : మండలంలోని వెంకన్నపాళెం గ్రామం దళితవాడలో ఓ వివాహిత బుధవారం అనుమానాస్పదంగా మృతిచెందింది. భర్త కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకుందని చెబుతుండగా, మహిళ తరఫు బంధువులు భర్త ఇంటివారే కొట్టి చంపారని ఆరోపిస్తున్నారు. బంధువులు, పోలీసుల కథనం మేరకు వివరాలు.. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం విన్నమాల గ్రామానికి చెందిన శ్యామల(30)తో ఎనిమిది సంవత్సరాల క్రితం మండలంలోని వెంకన్నపాళెం గ్రామానికి చెందిన మెడబల్లి ప్రసన్నకుమార్‌తో వివాహం జరిగింది. శ్యామలను భర్త తరచూ కొట్టేవాడని, గతంలో కూడా ఈ విషయమై పెద్ద మనుషుల సమక్షంలో మధ్యవర్తిత్వం జరిగిందని బంధువులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం ఇంట్లో గొడవలు జరగ్గా, మీరు వచ్చి శ్యామలను తీసుకెళ్లకపోతే చంపేస్తామని అత్తింటి వారు ఫోన్ చేసి బెదిరించారని శ్యామల బంధువులు తెలిపారు. కాగా బుధవారం ఫోన్ చేసి శ్యామల కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుందని ఒకసారి, ఉరేసుకుందని మరోసారి పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని వారు ఆరోపించారు. శ్యామల ఒంటిపై గాయాలు ఉన్నాయని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. సీఐ సంగమేశ్వరరావు, ఎస్సై ముత్యాలరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.480 కోట్లతో నాడు–నేడు పనులు



పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ, ఎంఈఓ

- డీఈఓ గంగాభవాని

మనుబోలు : జిల్లాలోని 1,375 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.480 కోట్లతో మనబడి నాడు–నేడు రెండో విడత పనులు ప్రారంభించామని జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని తెలిపారు. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని జేవీకే స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం లక్షా 90 వేల 742 జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభించిన రోజే జేవీకే కిట్లను పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలోని 597 ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లల కోసం 780 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఒకటో తరగతి చదవాలనుకునే పేద పిల్లలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాడు–నేడు పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామని తెలిపారు. ఆమె వెంట ఏపీసీ ఉషారాణి, ఎంఈఓ శేషాద్రివాసు, హెచ్ఎం డేవిడ్ తదితరులు ఉన్నారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు ప్రాజెక్టు ఇంజినీర్లు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా ఒకటో యూనిట్లో 550 మెగా వాట్లు, రెండో యూనిట్లో 450 మెగావాట్లు, మూడో యూనిట్లో 625 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 162
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 274
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 304
లేయర్ చికెన్	: 170